క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని ఆదర్శనగర్ ఫీడర్ పరిధిలో 11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శనగర్, భాగ్యనగర్, ఈద్‌గాం, ఫిష్ మార్కెట్ కాలనీల్లో ఉదయం తొమ్మిది నుంచి నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయానికి విరాళం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీలో ఉన్న గంగాయిపేట్ ఆలయానికి భైంసా పబ్లిక్ ప్రాసిక్యూటర్ తునికి అరుణ–రవీందర్ దంపతులు తమ కూతురు తనిష్క చేతుల మీదుగా రూ.10వేల విరాళం అందించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు బి.సంతోష్, బలగం రవీందర్, రాజన్న తదితరులు ఉన్నారు.

కడెం యువతకు సత్కారం



యువకులతో కాంగ్రెస్ నాయకులు

కడెం: ఇటీవల వర్షాల సమయంలో కడెం ప్రాజెక్ట్ గేట్లు మొరాయించగా.. కడెం యువకులు మాన్యువల్‌గా గేట్లను ఎత్తి ప్రాజెక్ట్‌ను ప్రమాదం నుంచి కాపాడిన విషయం తెలిసిందే. వారి సేవలకు గుర్తుగా మంగళవారం కడెంలోని హరిత రిసార్ట్స్‌లో ఏఐసీసీ రిసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ వారిని శాలువాలతో సన్మానించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, వాజీద్‌ఖాన్, రఫీక్, భూషణం, బబ్లూ, సలీం ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కుంటాల: హరితహారంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పీఏసీఎస్ చైర్మన్ గజ్జారాం పేర్కొన్నారు. డీసీవో శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కుంటాల సొసైటీ కార్యాలయంలో రైతులతో కలిసి మొక్కలు నాటారు. డైరెక్టర్ ప్రణయ్‌రావు, సీఈవో నాగభూషణం, శ్రీనివాస్‌రెడ్డి, బాపన్న, భూమన్న, కృష్ణ, తదితరులున్నారు.

భైంసాలో క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న డీఎం, ఉద్యోగులు

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కేబినెట్ నిర్ణయం తీసుకోవడంతో మంగళవారం డీఎం అమృత, ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. సీఎం కేసీఆర్, మంత్రి అజయ్, చైర్మన్ బాజిరెడ్డి, ఎండీ సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంతోష్, భగవంత్‌రావు ఉన్నారు.

'అప్రకటిత కోతలు వద్దు'

ఖానాపూర్: విద్యుత్ అధికారులు అప్రకటిత కోతలు విధించవద్దని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సబ్‌ఇంజినీర్ వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజలకు ఇబ్బంది కల్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అందుబాటులో ఉండాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిషోర్‌నాయక్, కదార్ల గంగనర్సయ్య, తోట సత్యం, తదితరులు ఉన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన



మాట్లాడుతున్న ఆర్డీవో రత్నకల్యాణి

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌లో పోలింగ్‌బూత్‌లను మంగళవారం ఆర్డీవో రత్నకల్యాణి పరిశీలించారు. ఆమె అధికారులకు సూచనలు చేశారు. మండలంలోని పోలింగ్ బూత్‌ల వివరాలు, ఓటర్లకు అందుతున్న వసతులు తహసీల్దార్ కవితారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ దేవిక తదితరులు ఉన్నారు.

అవగాహన పెంచుకోండి

నిర్మల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పట్టణ సీఐ పురుషోత్తం పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని చాణక్య జూనియర్ కాలేజీలో మంగళవారం షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రత, రక్షణ, పోక్సో చట్టాలు, బాల్యవివాహాలు, డయల్ 100, 1098, 1930 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆపదలో షీటీమ్ వాట్సప్ నంబర్ 87126 59550కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. షీటీం ఎస్సై సుమాంజలి, జ్యోతి మణి, సిబ్బంది లింగయ్య, రమాదేవి, రాధిక, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హరితహారం

- ఊరూరా మొక్కలు నాటుతున్న వైనం
- పాల్గొంటున్న అధికారులు, నాయకులు



పొట్టపెల్లిలో మొక్కలు నాటుతున్న కూలీలు



రాచాపూర్ సమీపంలో గుంతలు తీస్తున్న కూలీలు

లక్ష్మణచాంద: తెలంగాణలో పచ్చదనం పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏటా హరితహారం చేపడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా గ్రామపంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచారు. ఇప్పటికే గ్రామాల్లోని ఖాళీస్థలాలు, రోడ్ల పక్కన, పాఠశాలల్లో గుంతల తవ్వకం పూర్తి చేశారు. భారీ వర్షాలు కురవడంతో ఉపాధిహామీ కూలీలు మొక్కలు నాటుతున్నారు.

లక్ష్మణచాందలో లక్షా 98 వేల మొక్కలు..

లక్ష్మణచాంద మండలంలో 18 పంచాయతీల పరిధిలోని 23 గ్రామాలున్నాయి. ఒక్కో నర్సరీలో 10 వేల చొప్పున మొత్తం లక్షా ఎనభై వేల మొక్కల పెంపకం చేపట్టారు. ప్రతి గ్రామంలో లక్ష్యం మేర మొక్కలు నాటాలని అధికారులు నిర్దేశించారు.

అదనంగా వెయ్యి మొక్కల పెంపకం..

నర్సరీల్లో విత్తనాలు ఎండిపోవడం, సరిగా మొలకెత్తకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయనే ఉద్దేశంతో ఒక్కో నర్సరీలో అదనంగా వెయ్యి మొక్కలు పెంచారు.

దీంతో ప్రతి పంచాయతీకి 11 వేల మొక్కల చొప్పున మొత్తం 18 పంచాయతీల్లో లక్షా 98 వేల మొక్కలను అధికారులు సిద్ధం చేశారు.

- మామడ మండలంలో మొత్తం 27 పంచాయతీల పరిధిలో 42 గ్రామాలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీలో 10 వేల చొప్పున మొత్తం 2.70 లక్షల మొక్కలు సిద్ధం చేశారు.
- సోన్ మండలంలోని 14 పంచాయతీల పరిధిలో 15 గ్రామాలు ఉన్నాయి. దీంతో ఒక్కో పంచాయతీలో 10 వేల చొప్పున మొక్కలను సిద్ధం చేశారు.
- దిలావర్‌పూర్ మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా లక్షా 20 వేల మొక్కలను సిద్ధం చేశారు.

పనులు వేగవంతం..

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుడంటంతో ఆయా గ్రామాల్లో సిద్ధమైన మొక్కలను నాటేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు.

ఇప్పటికే గ్రామాల్లో హోం సీడ్ మొక్కలు పంపిణీ చేసి నాటేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలు వివిధ రకాల మొక్కలు నాటుతున్నారు.

వేగంగా గుంతల తవ్వకం..



మా గ్రామంలో పాఠశాలలు, ఆలయాలు, ఇతర ఖాళీస్థలాల్లో మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలు గుంతలు తవ్వుతున్నారు. ఈసారి నాటిన మొక్కల్లో ఒక్కటీ కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– లత, పీచర సర్పంచ్

మొక్కలు నాటిస్తున్నాం



హరితహారంలో భాగంగా మండలంలోని 18 నర్సరీల్లో పెంచిన లక్షా 98 వేల మొక్కలను నాటేందుకు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే గుంతల తవ్వకం పూర్తయింది. పలు గ్రామాల్లో మొక్కలు నాటడం ప్రారంభించాం.

– ప్రమీల, లక్ష్మణచాంద ఏపీవో

నాలాల్లో చెత్త తొలగించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



నాలాలను పరిశీలిస్తున్న కలెక్టర్, పక్కన సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: నాలాల్లో చెత్త చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ రాజును కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్‌పేట్, బంగల్‌పేట్, తిరుమల థియేటర్, మంచిర్యాల ఎక్స్‌రోడ్, శాంతినగర్, వైఎస్సార్ కాలనీలో డ్రెయినేజీలను మంగళవారం పరిశీలించారు. భారీ వర్షాలకు నాలాల్లోకి చెత్త, మట్టి కొట్టుకువచ్చి వరద రోడ్లపైకి వస్తుందన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ సుభాష్ చందర్, ఇరిగేషన్ అధికారి రామారావు ఉన్నారు.

పశుపోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా పశువైద్యాధికారి శంకర్



మామడలో కార్యక్రమం పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి శంకర్

మామడ: పశుపోషకులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో పశువులకు మంగళవారం నట్టల నివారణ మందు తాగించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో చెరువులు, కాలువల నీటిని తాగినప్పుడు, పచ్చిక మేసినప్పుడు రోగాలు సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. పశువైద్యాధికారి ఓంప్రకాశ్, పశుపోషకులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని వడ్గాం గ్రామంలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందు తాగించారు. పశువైద్యాధికారి గోపాల్ మహాజన్ సర్పంచ్ సంతోష్, గోవింద్‌రావ్ పటేల్, సిబ్బంది ఉన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కుంటాల: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. వర్షాకాలం కారణంగా ప్రజలకు పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పర్యటన..

2022–23లో కుంటాలలో చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమాలపై అధ్యయనం చేసేందుకు బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ టీం సభ్యులు గ్రామంలో పర్యటిస్తారని డీఆర్డీవో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు.

అధిక శ్రావణమాస పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని వాసవిమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో అధిక శ్రావణమాస పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 18 ఏళ్ల తర్వాత ఈ మాసం రావడంతో బ్రాహ్మణులకు, గోమాతకు 33 రకాల వాయినాలను అందజేశారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, శ్రీమంగళ గౌరీ సమేత నగరేశ్వరస్వామి రమాసమేత సత్యనారాయణ వార్లకు సుగంధ ద్రవ్యాల కలశాలతో విశేష అభిషేకం, బిల్వార్చన, తులసీ అర్చన, పుష్పార్చన నిర్వహించారు. అర్చకులు అభిషేక్‌శర్మ, అన్వేష్‌శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిపారు. వేడుకలో జితేందర్, బుచ్చన్న, మాధవి, గీతారాణి, వాసవి, రాజేందర్, కిషన్, లక్ష్మీనారాయణ, సతీశ్, మానస, శ్వేత, ప్రవంతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

సర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని డొంగుర్గాంలో మంగళవారం డ్రై డే నిర్వహించారు. నిల్వ నీటిని పారబోయించి గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్, వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని అందకూర్, కుంటాల, ఓలా తదితర గ్రామాల్లో మంగళవారం డ్రై డే నిర్వహించారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దాసరి కిషన్, సమత, ఎంపీటీసీ మధుకర్, కార్యదర్శులు రాజబాపు, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని గాంధీనగర్‌లో మంగళవారం వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎంపీడీవో మోహన్‌రెడ్డి వివరించారు. ఎంపీవో ఖలీల్ హైమద్, ఏపీవో మంజులారెడ్డి, ఏపీఎం గంగామణి, కార్యదర్శి, సంగీత తదితరులున్నారు.

ముధోల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి సుదర్శన్‌రాథోడ్ అన్నారు. మంగళవారం మండలంలోని చించాల, వెంకటాపూర్‌లో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిల్వ నీటిని పారబోయించారు. ఎంపీడీవో సురేశ్‌బాబు, ఏపీవో శిరీష, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల వ్యాధులపై అవగాహన కల్గి ఉండాలని ప్రభుత్వాసుపత్రి వైద్యులు వెంకటసాయి సువర్దన్ పేర్కొన్నారు. మంగళవారం ముధోల్ మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులకు వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎండీ రఫీఉద్దీన్, సూపర్‌వైజర్ లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్సాపూర్(జి): నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

తల్లిపాలు అమృతంతో సమానం

ఖానాపూర్: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. మంగళవారం మండలంలోని గోసంపల్లె, దిలావర్‌పూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఆయా కేంద్రాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ త్యాగాలు మరువలేనివి

భైంసారూరల్: చిట్యాల ఐలమ్మ త్యాగాలు మరువలేనివని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర కోకన్వీనర్ సుంకెట పోశెట్టి అన్నారు. మంగళవారం మండలంలోని కామోల్ గ్రామంలో ఐలమ్మ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఎంపీటీసీ నర్సారెడ్డి, అమేందర్, రజక సంఘం నాయకులు అవినాశ్, ముత్యం, రామకృష్ణ, సాయేందర్ తదితరులు ఉన్నారు.

పరిహారం అందించండి

భైంసారూరల్: భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన ప్రభుత్వం రైతులకు పరిహారం అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావుపటేల్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఖత్గాం రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. వారి వెంట మిర్జాపూర్ ఎంపీటీసీ రజాక్, రాము, వెంగల్‌రావు, మారుతి, లక్ష్మణ్‌పటేల్, పాపయ్య, దిగంబర్, శంకర్, మారుతి తదితరులు ఉన్నారు.

అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని ఓవైసీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటుహక్కు ప్రాధాన్యత, ఓటు వేసే విధానం వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ జయరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని ముద్గల్ గ్రామంలో బుధవారం గ్రామస్తులకు ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్, ఉపసర్పంచ్ ప్రవీణ్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిని కలిసిన నేతలు

భైంసాటౌన్/కుంటాల: ఇటీవల భారీ వర్షాలకు ముధోల్ నియోజకవర్గంలో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలు, చెరువులు, రోడ్ల పరిస్థితి వివరించారు. తానూర్ మండలంలోని బెల్‌తరోడ, భైంసా మండలంలోని మహాగాం గ్రామాలను మండలాలుగా ప్రకటించాలని కోరారు. జీవి రమణరావు, సావ్లి రమేశ్, రవీందర్‌రావు, పండిత్‌రావు ఉన్నారు.

వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిస్ గౌరి



రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి గౌరి

తానూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున.. వైద్యసిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిస్‌గౌరి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. జ్వరాలున్న వారిని పీహెచ్‌సీకి పంపి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్లలో పని చేస్తున్న ఏఎన్ఎంలను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జ్వరపీడితుల వివరాలు తెలుసుకొని.. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అబ్దుల్ కాసీం, ఫార్మసిస్ట్ సదానంద్‌గౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేటి నుంచి 'తొలిమెట్టు'పై శిక్షణ

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి తొలిమెట్టు కార్యక్రమంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందని ట్రైనింగ్ ప్రోగ్రాం అధికారి సాయికృష్ణ తెలిపారు. ఖానాపూర్, పెంబి మండలాల్లోని 120 మంది ఉపాధ్యాయులకు ఆరు రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. తెలుగు, ఆంగ్లం, గణితం విషయాలపై రెండు రోజులకోసారి 40 మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. ఆరుగురు ఎమ్మార్పీలతో ఈ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. ఉపాధ్యాయులు హాజరై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లక్ష్మణచాంద మండలంలో...

లక్ష్మణచాంద: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఈనెల రెండో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు తొలిమెట్టుపై వడ్యాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల నోడల్ అధికారి ఫయామ్ తెలిపారు. మంగళవారం మండలంలోని వడ్యాల్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు అశోక్‌వర్మ, మోహన్, సీఆర్పీలు సుధాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అన్నాభావు సాఠే



భైంసాలో నివాళులర్పిస్తున్న నాయకులు

భైంసాటౌన్: బలహీన వర్గాల కోసం పోరాడిన అన్నాభావు సాఠే ఆదర్శనీయుడని పలువురు పేర్కొన్నారు. పట్టణంలోని ఐబీ వద్ద కమిటీ హాల్‌లో భీం ఆర్మీ, దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో అన్నాబావు సాఠే జయంతి నిర్వహించారు. అలాగే బుద్ధిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏపీనగర్, రాహుల్‌నగర్‌లోని బుద్ధవిహార్‌లో సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ సంఘాల నాయకులు పోశెట్టి, లక్ష్మణ్, సాహెబ్‌రావు, సాహెబ్‌రావు, ప్రసంజిత్ తదితరులున్నారు.

కుభీర్: మండలంలోని చొండి గ్రామంలో మంగళవారం సాహితీ సామ్రాట్ అన్నాభావు సాఠే జయంతి నిర్వహించారు. సర్పంచ్ చంద్రకాంత్, ఎస్.దిగంబర్, గజ్జారాం తదితరులు ఉన్నారు.

పూర్తయిన సేత్వారి సర్వే

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాలతో ప్రారంభించిన సేత్వారి సర్వే మంగళవారం ముగిసింది. సర్వేలో గ్రామంలోని రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ భూముల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఐ షేక్ రఫీ, సర్వేయర్లు పరమేశ్వర్, బాలకృష్ణ, పుష్ప మాట్లాడారు. సర్వే వివరాలు పాలనాధికారికి నివేదించి.. రైతులకు త్వరలో పట్టా పాసు పుస్తకాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు రెమ్మాయి సాగర్, కొండ రవి, తోట సాయన్న, రొడ్డ రాజేశ్వర్, పిండి మల్లయ్య, నర్సింగ్‌రావు, గొడుగు భూమేశ్, రాజేందర్, రాజలింగం, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎల్‌వోసీ అందజేత

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన ఓస రవి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోగా వైద్యానికి పెద్దమొత్తంలో ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో అతను మంగళవారం బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మండలాధ్యక్షుడు క్రిష్టారెడ్డి ద్వారా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కలిసి తన బాధ చెప్పుకున్నారు. స్పందించిన మంత్రి వైద్యం కోసం రూ.2.50లక్షల ఎల్‌వోసీని బాధితుడికి అందించారు. నాయకులు నర్సారెడ్డి, సురేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 1, 5 తరగతుల విద్యార్థుల కోసం రాత పుస్తకాలు అందజేశారు. ఎంఈవో కార్యాలయంలో మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, మోహన్‌రెడ్డి, లక్ష్మినారాయణ, సీఆర్పీలు సుధాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం సమావేశం

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో మంగళవారం కురుమ సంఘం ముఖ్య నాయకులతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కులస్తుల ఐక్యత, సంఘం బలోపేతంపై చర్చించారు. అమరగొండ మల్లేశ్, ఏనుగుల రాజేశ్, సిగుర్ల రాజేశ్వర్, జంగం రమేశ్, దాసరిగొండ మల్లయ్య, మేకల గంగమల్లు, నర్సయ్య, బైరి రాజన్న, బీరయ్య, మల్లేశ్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ఖానాపూర్: సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ నాయకుడు భుక్య జాన్సన్ నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ మాజీ ఉపసర్పంచ్, రెండో వార్డు కౌన్సిలర్ కారింగుల సంకీర్తనసుమన్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు పట్టణంలోని తాపీ మేస్త్రీ సంఘ భవనంలో జాన్సన్‌నాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆకుల రమేష్, కంకటి జనార్దన్, అల్లె రాజేశ్వర్, గంగాధర్, రాము, ప్రసాద్, శ్రీనివాస్, రాజన్న, ఖాజా, రఫీ, ప్రణయ్, వంశీ, వినయ్ తదితరులు ఉన్నారు.

కిసాన్ సెల్ మండలాధ్యక్షుడిగా జగన్‌రెడ్డి

కడెం: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడిగా మండలంలోని ధర్మాజీపేటకు చెందిన ఎర్ర జగన్‌రెడ్డిని నియమించినట్లు కిసాన్‌సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయనకు నియమాక పత్రం అందజేశారు. పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, రహీం, యాదగిరి, కుమార్, బబ్లూ, బ్రహ్మచారి ఉన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

లోకేశ్వరం: అభివృద్ధి పనులు చేపట్టేందుకు మండలంలోని కిష్టాపూర్, గడ్‌చాంద గ్రామాలకు జెడ్పీ నిధులు మంజూరయ్యాయి. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్ ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, ఎంపీటీసీ దత్తురాం పటేల్, జయసాగర్‌రావు, సర్పంచ్ వెంకట్‌రావు, కపిల్, ప్రశాంత్, సుధీర్‌రెడ్డి ఉన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

కుంటాల: నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని.. బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పీఏసీఎస్ మాజీ చైర్మన్ గొల్లమాడ సూర్యకాంత్‌రావు పేర్కొన్నాడు. మంగళవారం మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను, పొలాలు పరిశీలించారు. బీఆర్ఎస్ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు మహేందర్, భోజన్న తదితరులున్నారు.

27వరోజుకు కార్మికుల సమ్మె

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక రిలే నిరాహారదీక్షలు మంగళవారం 27వ రోజుకు చేరాయి. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని.. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చంద్రశేఖర్, నాగరాజు, పోశెట్టి, స్వామి తదితరులు ఉన్నారు.

తిలక్‌కు నివాళి

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో మంగళవారం బాలగంగాధర్ తిలక్ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ ఇన్‌చార్జి స్వప్న శర్మ, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కుంటాల: మండలంలోని ఓలా ఉన్నత పాఠశాలలో మంగళవారం సర్పంచ్ కనీష్ ఫాతిమా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా రూ.270, 20:20:13 ధర రూ.1140గా ఉందని పట్టాదారు పుస్తకం, ఆధార్‌తో వచ్చి తీసుకెళ్లాలని సూచించారు.